మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## అక్రమంగా నిల్వ చేసిన 19 గ్యాస్ సిలిండర్ల పట్టివేత

**బెజ్జంకి, ఏప్రిల్ 7,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బేగంపేటలో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన 19 సిలిండర్లను మంగళవారం జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జి.తనూజ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసిన సమాచారం అందుకున్న డిఎస్ఓ జి.తనూజ, డిఎల్ఎం శివరంజని జిల్లా అధికారుల బృందంతో కలిసి సిల్లండర్లు దాచిన ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. దాడిలో హెచ్పి,ఇండియన్, భారత్ గ్యాస్ కంపెనీలకు సంబంధించిన 19 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్ఓ తనూజ తెలిపారు. సిలిండర్లు దాచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



అక్రమ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న డిఎస్ఓ తనూజ

## శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం

**సదాశివపేట,ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** సదాశివపేట పట్టణంలోని శ్రీ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీ దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమానికి 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులను ఆలయ కమిటి సభ్యులు ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. ఇట్టి కార్యక్రమాలు తేది 09-04-2026 గురువారం నుండి మొదలుకొని తేది 12-04-2026 సోమవారం వరకు కొనసాగు తాయని ఆలయ కమిటీ సభ్యులు పులిమామిడి మమతకు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను మమతకు అందజేసి, కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా పులిమామిడి మమత రాజు దంపతులు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం, సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహకులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఇట్టి దైవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాలను విజయవంతం చేసి ఆభగవంతుని కృపకు పాత్రులు కాగలరని పులిమామిడి మమత పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.



మంత్రి దామోదర చేతుల మీదుగా ఆవార్డు అందుకుంటున్న రాజేశ్వర్

## బెస్ట్ పెర్ఫార్మెన్స్ఆవార్డు అందుకున్న మెళాసంగెం వాసి

### మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా పురస్కారం

**మునిపల్లి,ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** మునిపల్లి మండలం మేళా సంఘం గ్రామానికి చెందిన రాజేశ్వర్ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ సేవా పురస్కారం అందు కొన్నారు.రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి ఆయనకు ఆవార్డు అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం నాడు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.సంగారెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీతో కలిసి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్నారు.జిల్లాలో ఆహార కల్తీని అరికట్టడంలో, ప్రజలకు స్వచ్ఛమైన ఆహారం అందేలా నిరంతరం తనిఖీలు చేస్తూ అత్యుత్తమ బాధ్యతను నిర్వర్తించినందుకు గాను వీరికి ఈ పురస్కారంతో అందజేశారు.మునిపల్లి మండలానికి చెందిన రాజేశ్వర్ జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తూ,రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు, మండల నాయకులు రాజేశ్వర్‌ను అభినందించారు.

## 3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు రాష్ట్రస్థాయి అవార్డులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలోని రెండు పిహెచ్‌సిలకు 3 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు రాష్ట్ర స్థాయి అవార్డుల లభించాయి. జిల్లాలోని ఇందుప్రియల్,రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, రాయపోలు మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి, బెజ్జంకి మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గానూ రాష్ట్రస్థాయిలో అవార్డులు లభించాయి. హైదారాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అవార్డులు అందుకున్న వైద్యాధికారులను,ఎంఎల్‌హెచ్‌సిలు, ఎఎన్ఎంలను అభినందించారు. అవార్డులు అందుకున్న ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ మందిర్‌లను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించి రాష్ట్రస్థాయిలో ముందుండాలన్నారు.



### 9 సంత్సరాల భూ సమస్యకు

## ముగింపు పలికిన తహశీల్దార్

**బెజ్జంకి, ఏప్రిల్ 7,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్లెపల్లి రెవెన్యూ గ్రామంలోని గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోగల సర్వేనంబరు 177,178,179,180,184, 237,235,91,121, 187,229, 231,232,174,384,391లో 63-18 ఎకరాలు గతంలో ఎల్‌పిఎస్ కింద భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చిన విషయం విధితమే. అయినప్పటికీ మ్యుటేషన్ సర్వే పెండింగ్ ఉండడం మూలంగా కొంత మంది బాధితులు అప్పుడు ఆర్‌టిఐ ఫౌండర్, జాతీయ మాల మహానాడు తెలంగాణ శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసూరి మల్లికార్జున్‌ను ప్రత్యేకంగా కలిసి సంప్రదించగా లోకాయుక్త వివిధ న్యాయస్థానాలలో ఫిర్యాదు చేశారు. తద్వారా కోర్టు తీర్పుల ఆధారం గా బాధితులు పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ హుస్నాబాద్,తహశీల్దార్ బెజ్జంకి కలిసి సర్వే చేసి మోఖ చూపించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని బాధితులు పలుమార్లు దరఖాస్తు చేసుకోగా ఎంతో మంది అధికారులు స్థానచరణం కలిగిన కానీ కనుకరించలేదు. ప్రస్తుత తహశీల్దార్ శ్రీకాంత్ కోర్టు తీర్పుల ఆధారంగా ఉన్నత అధికారుల సూచన మేరకు అతి తక్కువ సమయంలోనే రికార్డుల ఆధారంగా మోఖా సర్వే చేయించి సమస్యకు శాశ్వత పరిష్కరం చూపారు. ఈ మేరకు తహశీల్దార్, శ్రీకాంత్‌తో పాటు ఆర్ఐ సుహాసిని, సర్వేయర్ శ్రీనివాస్, లైసెన్స్ సర్వేయర్ సత్యం, వంశీ, జిపిఓ నిరోషాలను తహశీల్దార్ కార్యాలయంలో శాలువాలతో సత్కారించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టి ప్రచారం కమిటీ చైర్మన్ అండ్ ఫౌండర్ మాంకాల బాలయ్య, రాకం రాజు,మోదుగుపల్లి రాజు, కొంపల్లి రాజు,మాంకాల బాబు, మాంకాల భూపేందర్, ఉప్పులేటి శ్రీనివాస్, మెరుగు కనకయ్య, మాంకాల బయన్న, మెరుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌ను సత్కారిస్తున్న దృశ్యం



ప్రభుత్వ భూమి కబ్జా ఆపాలంటూ ఫిర్యాదు చేస్తున్న బేగంపేట గ్రామస్థుల దృశ్యం

## ప్రభుత్వ భూమి కబ్జా-ప్రజావాణిలో ఫిర్యాదు

కంది, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుంటున్నారని మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన ప్రజలు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ బేగంపేట గ్రామంలోని సర్వే నంబర్ 249లోని ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారన్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ నిర్వహించి సదరు భూమి ప్రభుత్వానిదే అని నిర్ధారించినట్లు గుర్తు చేశారు. అప్పట్లో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు లోనైన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విచారం వ్యక్తం చేశారు. 249 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిపై పంచాయితీ కార్యదర్శుల ద్వార ఇంటి నెంబర్లు, అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి, డాక్యుమెంట్లు సృష్టించారని ఆందోళన వ్యక్తం చేశారు. 249 సర్వే నంబర్‌లోని 3 ఎకరాల 20 గుంటల భూమి మార్కెట్ విలువ 10 కోట్లుగా ఉంటుందన్నారు. సేల్ డీడ్‌లను రద్దు చేసి సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామానికి చెందిన రామ్ సింగ్ నాయక్, ప్రతాప్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హరికృష్ణ, ప్రభుగౌడ్, వేణుగౌడ్, జగదీష్ నాయక్, సిహెచ్ యాదగిరి, సాయి కిరణ్, గుర్రం శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు.

# అంగరంగ వైభవంగా బేతాళ స్వామి జాతర



ఆలయానికి చేరుకున్న భక్తులకు జావ అందచేస్తున్న పూర్వ విద్యార్థులు



అల్లాదుర్గంలో బేతాళ స్వామి ఆలయం చుట్టూ తిరిగాడుతున్న ఎడ్ల బండ్ల దృశ్యం

### -ఆకట్టుకున్న ఎండ్ల బండ్ల ప్రదక్షిణలు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో శ్రీబేతాళ స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జాతర ప్రధాన ఘట్టమైన ఎడ్ల బండ్ల ప్రదక్షిణ భక్తులకు ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల నుంచి భక్తులు అందంగా అలంకరించిన తమ ఎడ్ల బండ్లతో జాతరకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. జాతర ఉత్సవాలు ప్రశాతంగా ముగిసేలా సిఐ రేణుకరెడ్డి, ఎస్ఐ శంకర్‌ల ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

**-అన్నదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు...**

బేతాళ స్వామి జాతర ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులకు పూర్వ విద్యార్థులు రాగి జావా, మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండుటెండల్లో ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులకు రాగి జావా, మజ్జిగ, నీటి ప్యాకెట్లు అందుకుని సేవించి పూర్వ విద్యార్థులను అభినందించారు.



శ్రీ వెంకటేశ్వర స్వామిపై ఉదయం సూర్యకిరణాలు పడ్డ దృశ్యం

## వెంకటేశ్వరుడిపై సూర్యకిరణాల అభిషేకం

**అల్లాదుర్గం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం సూర్యోదల సమయంలో భానుగి కిరణాలు నేరుగా గర్భాలయంలోని మూల విరాటుడిపై పడ్డాయి. అద్భుత దృశ్యాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. అర్చకులు ప్రవీణ్‌శర్మ పండితులు వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## వెంచర్‌లో అక్రమ గేటు, ప్రహరీ గోడలు తొలగింపు



వెంచర్‌లో అక్రమ గేటు, ప్రహరీ గోడలు తొలగింపు

**నార్సింగి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో రైతులు తమ కష్టాలను తీర్చిన అధికారులు,సమస్యను అధికారులు దృష్టి లోకి తెచ్చిన, సమస్య పరిష్కరించే విధంగా కృషి చేసిన విలేఖరులకు కృతజ్ఞతలు తెలిపారు.వివరాలలోకి వెళ్తే మండల పరిధిలోని శంకాపూర్ లో సర్వే నం 278, 279, 280, 281 లలో దాదాపు 4.55 ఎకరాలలో 2023-24సంలో పూర్తి అనుమతులు పొందకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా శ్రీకర హౌసింగ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ వారు వెంచర్ ఏర్పాటు చేశారు.పొందిన అరకొర అనుమతులలో ఓపెన్ వెంచర్ గా నమోదు చేయించి పరిసర రైతులకు తమ వ్యవసాయ పొలాలకు దారి ఇవ్వకుండా అక్రమంగా ప్రహరీ గోడలు,గేటు ఏర్పాటు చేసుకున్నారు. గోడలు,గేటు నిర్మాణ సమయంలో రైతులు అభ్యంతరం తెలిపినా రైతుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గేటును తెరిచే ఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం గేటుకు తాళం వేసిన నిర్వాహకులతో ప్రశ్నించిన రైతులను భూమి తమకు అమ్మాలని,లేదా దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ బెదిరింపులకు దిగారు.నాట్లు వేసే సమయం మించినా నాట్లు వేయడానికి వీలు లేకుండా చేస్తున్నందుకు ఒకసారి చేతికంది వచ్చిన తమ పంటల కోతల సమయం మించి పోతున్నా కోతలకు వీలు లేకుండా చేస్తున్నారని ఒక సారి వెంచర్ పరిసర రైతులు రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేశారు. అప్పట్లో స్పందించిన తహసీల్దార్ గ్రేస్ బాయి,ఎస్ఐ సృజన వెంచర్ నిర్వాహకులతో మాట్లాడి గేటు తాళం చెవిని పంచాయతీ కార్యదర్శి మోనిక వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేశారు. అంతకు ముందు రైతులు తమ సమస్య పరిష్కారం చేయాలని ప్రజావాణిలో కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చారు. సమస్య శాశ్వత పరిష్కారం కాకపోయినా కాస్త ఉపశమనాన్ని పొందిన రైతుల కథ మళ్ళీ మొదటికి వచ్చింది.తమ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎంతో ఆశతో రైతులు మళ్ళీ కలెక్టరేట్ లో ప్రజావాణి లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.వెంచర్ నిర్వాహకుల ఆగడాల పై ..వార్త పత్రిక.. లో వరుస కథనాలను ప్రచురితం చేస్తూ సమస్యను అధికారులు దృష్టి పదేపదే తేవడం జరిగింది.సమస్యపై స్పందించిన అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్ సమస్యను పరిష్కారం చేయాలని డీపీఓ యాదయ్య ను ఆదేశించారు.అయినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో మండల విలేఖరులు డీపీఓ యాదయ్యను సంప్రదించి సమస్య తీవ్రతను తెలుపుతూ వివరణ కోరారు. వెంటనే స్పందించిన డీపీఓ యాదయ్య శంకాపూర్ పంచాయతీ కార్యదర్శి మోనిక ను వెంచర్ వద్ద అక్రమంగా నిర్మాణం చేసిన గోడలు రెండు రోజులలో తొలగించాలని నిర్వాహకులకు నోటీసులు పంపాలని ఆదేశించారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వివరాలను తెలపాలని డీఎల్పీఓ యాదయ్య ను ఆదేశించారు. డీఎల్పీఓ యాదయ్య నివేదిక పంపినా సమస్య మాత్రం పరిష్కారం జరగలేదు. విసిగి వేసారిన రైతులు నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ప్రజావాణి లో కలిసి తమ గోడును వినిపించి సమస్య పరిష్కారం కోసం వేడుకున్నారు. రైతుల బాధల పై చలించిన కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఇంతకాలంగా సమస్య పరిష్కారం చేయకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాలతో డీపీఓ యాదయ్య ఎట్టకేలకు స్పందిస్తూ వెంచర్ లో అక్రమంగా నిర్మించిన గేటు,ప్రహరీ గోడలను శంకాపూర్ పంచాయతీ కార్యదర్శి మోనిక ను ఆదేశించారు. మంగళవారం మోనిక పంచాయతీ సిబ్బంది,జేసీబీ తో పాటు వెంచర్ కు చేరుకుని,గేటు ప్రహరీ గోడలను పూర్తిగా తొలగించారు.తమ వ్యవసాయ పొలాలకు వెళ్లకుండా వ్యవసాయం చేయనివ్వకుండా నిలువరించి తమ పొట్ట కొట్టిన అక్రమ వెంచర్ గేటు,ప్రహరీ గోడలు తొలగించి తమ కష్టాలను తీర్చిన కలెక్టర్ ప్రతిమా సింగ్, సమస్య పరిష్కారం లో ముఖ్య పాత్ర పోషించిన మండల విలేఖరులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## హత్నూరలో జపాన్ బృందం పర్యటన

**హత్నూర ,ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** నెక్స్ట్ భారత సుజుకి ఇన్నోవేషన్ సెంటర్ కు చెందిన జపాన్ పరిశోధన బృందం హత్నూర మండలం సిరిపుర గ్రామంలో మంగళవారం పర్యటించింది. గ్రామీణ ప్రాంతాల్లో టెక్నాలజీ వినియోగం, డిజిటల్ సేవల ప్రాచుర్యం వంటి అంశాలపై అవగాహన కోసం ఈ పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా బృంద సభ్యులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకు న్నారు. గ్రామాల్లో ప్రజలు ఉపయోగిస్తున్న టెక్నాలజీ విధానాలు, బ్యాం కింగ్ సేవలు, ముఖ్యంగా యూపీఐ యాప్స్ వినియోగంపై వివరాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో జపాన్ పరిశోధన బృందానికి చెందిన చార్మైన్, టకేఉచి, మారియుమా తో పాటు కన్సల్టెంట్ రఘువంశీ పాల్గొన్నారు. వారు సిరిపుర, జెగ్గంపేట్ మరియు తెల్లరాళ్ల తండా గ్రామాలలో పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి వివిధ అంశాలపై సమాచారం సేకరించారు.ఈ కార్యక్రమంలో సిరిపుర మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, ఉప సర్పంచ్ మల్లేశం, పుట్టి వీరేశం, చంద్రమోహన్ రెడ్డి, చెన్న నర్సింలు, తెల్లరాళ్ల తండా సర్పంచ్ సుశీల మల్లేష్, ఉప సర్పంచ్ నామ్య నాయక్, దేవునిగుట్ట సర్పంచ్ మధు పాల్గొన్నారు.



జపాన్ బృందంతో గ్రామీణ వాసులు

## సిద్దిపేటలో మైనర్ బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట పట్టణంలో మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తూ, కేసులోని సాక్షులను బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిని సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేటలోని హనుమాన్ నగర్‌కు చెందిన బర్మా వెంకటేష్ తండ్రి పర్వతాలు గతంలో ఒక మైనర్ బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో ఆమెను వేధించాడు. ఈ ఘటనపై బాలిక తండ్రి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు కాగా వెంకటేష్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయితే జైలు నుండి విడుదలైన తరువాత కూడా నిందితుడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, బాలిక ఫోటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమె స్నేహితులకు పంపడం ప్రారంభించాడు. అంతేకాకుండా తనపై నమోదైన కేసులోని సాక్షులను కూడా బెదిరింపులకు గురిచేశాడు. బాధితురాలి తండ్రి మళ్లీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడు బర్మా వెంకటేష్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మహిళలను, ముఖ్యంగా మైనర్ బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరని ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ హెచ్చరించారు.



బాదరగామలో వార్షికోత్సవాలకు ముస్తాబైన పంచలింగేశ్వర ఆలయం దృశ్యం

## బాదరగామలో నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

### -నేడు సంగీత్ దర్బార్-రేపు కళ్యాణ మహోత్సవం

**మనూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాదరగామలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీ పంచలింగేశ్వర ఆలయం 7వ వార్షికోత్సవాలు సకల మత స్థాపకులు శ్రీశ్రీశ్రీ కాశీనాథ్‌బాబా ఆధ్వర్యంలో ఈ నెల 8, 9వ తారీఖులలో ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటి బాధ్యులు తెలిపారు. 8వ తారీఖున ఆలయ ఆవరణలో సంగీత్ దర్బార్ కార్యక్రమం, 9వ తారీఖున పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించనున్నామన్నారు. వార్షికోత్సవ కార్యక్రమాలకు ఆయా ఆలయాల పీఠాధిపతులు, హాజరవుతున్నారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పునీతలు కావాలని కాశీనాథ్ బాబా సూచించారు.

## మహిళలను అవమానిస్తూ, అధికారులను బెదిరిస్తున్న ఉప సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

**కోహెడ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండలంలోని సముద్రాల గ్రామ ఉప సర్పంచ్ వేల్పుల సింగరయ్య మహిళలను అవమానిస్తూ అధికారులను బెదిరిస్తున్నారని మాజీ వార్డు సభ్యురాలు వేల్పుల బాలవ్వ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇటీవల గ్రామసభలో జరిగిన ఘటనలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడి తనను వ్యక్తిగతంగా దూషించారని ఆరోపించారు. తాను తెలిపిన వివరాల ప్రకారం, తాను జీవన జ్యోతి స్వయం సహాయక సంఘంలో కార్యదర్శిగా పనిచేసి, తరువాత వార్డు సభ్యురాలిగా పోటీ చేయడానికి ఆ పదవికి రాజీనామా చేసి సంబంధిత అధి కారులకు లేఖ సమర్పించానని, ప్రస్తుతం తన స్థానంలో ఎవరు కొనసాగుతున్నారో తెలుసుకోవడానికి గ్రామసభలో ప్రశ్నించగా అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వ లేదని, ఈ సందర్భంలో ఉపసర్పంచ్ సింగరయ్య మహిళలను అవమానించే విధంగా మాట్లాడి తీవ్రమనస్తాపానికి గురిచేయడంతో పాటు, తనకు సంబంధం లేని విష యాల్లో కూడా అనవసరంగా జోక్యం చేసుకుంటూ అధికారులను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. వారి ఒకే కుటుంబానికి చెందిన పలువురు వివిధ పదవుల్లో ఉండడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తే, తాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవాడినని చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇంకా మహిళా సంఘం కార్యదర్శి పదవికి తాను ఇచ్చిన రాజీనామా లేఖ అధికారుల వద్ద ఉండాల్సి ఉండగా, ఆ లేఖను ఉపసర్పంచ్ సింగరయ్య మన సముద్రాల అనే గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసి తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆ లేఖ ఆయనకు ఎలా చేరిందనే విషయంపై కూడా విచారణ జరిపించాలని కోరారు. గ్రామ సర్పంచ్‌పై కూడా ఉపసర్పంచ్ సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు చేస్తూ గ్రామంలో అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను అవమానించడం, అధికారులను బెదిరించడం, వ్యక్తిగత పత్రాలను సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేయడం వంటి చర్యలు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తున్నాయని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఉపసర్పంచ్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.

## చిత్ర హింసలకు గురుచేస్తున్న బోధకులను సస్పెండ్ చేయాలి

### భోజనం పెట్టక, చితకబాధే బోధకులను సస్పెండ్ చేయాలంటు రోడ్డెక్కిన విద్యార్థులు

**కౌడిపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోగా, కులం పేరుతో ధూషించుతూ ఆకారణంగా చితకబాదుతున్న ఉపాధ్యాయుడు ఉదయ్‌ని, అందుకు పరో క్షంగా సహకరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రణయ్‌కుమార్‌లను వెంటనే సస్పెండ్ చేయాలంటూ నిరసిస్తూ మంగళ వారం నాడు విద్యార్థులు 765డి జాతీయ రోడ్డెక్కి విద్యార్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమం సుమారుగా 40 నిమిషాలు కొనసాగగా రహదారిపై వాహనాలు నిల్చిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక విలేకర్లతో మాట్లాడుతు ప్రతి నెల విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం భోజనం పెట్టకపోగా, విద్యార్థులు బయట నుండి బిర్యాని, బీర్లు తెచ్చుకొని తింటున్నారని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు ఉదయ్‌లు మాపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదు, రుజువు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. కాగా ఇదే విషయమై గతంలో కూడ అఖిల పక్షనాయకులు బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశ్ గౌడ్, ఉపాధ్యక్షులు రాజేందర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు సారా రామాగౌడ్, మాజీ ఎంపిపి రాజునాయక్‌చ, గిరిజన జన సమితి నేతలు వినోద్ నాయక్, దేవి చంద్ రాథోడ్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను కలసి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల విద్యార్థులు చేస్తున్న ధర్నా, రాస్తారోకో విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎఎస్సై మల్లయ్య ఘటన స్థలంకు వచ్చి విద్యార్థులతో చర్చించి, నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేసి, రోడ్డుపై ట్రాఫిక్‌ను క్లీయర్ చేయించారు.



చిత్ర హింసలకు గురుచేస్తున్న ఉపాద్యాయుడు ఉదయ్, ప్రిన్సిపాల్ ప్రణయ్ కుమార్‌లను సస్పెండ్ చేయాలంటు 765డి హైవేపై ధర్నా



మహాధర్నాకు తరలివెళ్తున్న రామాయంపేట ఆర్టిజన్‌లు

## మహా ధర్నాకు తరలిన రామాయంపేట ఆర్టిజన్‌లు

**రామాయంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమానికి రామాయంపేట సబ్ డివిజన్‌కు చెందిన ఆర్టిజన్‌లు తరలివెళ్లారు. తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా తమను కూడా పర్మినెంట్ చేయాలని, ప్రతి ఒక్కరికీ కన్వర్షన్ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాల్లో ఒధ కల్పించాలని కోరారు. ఈ మహా ధర్నా ద్వారా ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి డివిజన్ నాయకులు గావు సురేందర్, భూమయ్య, సంత్, రాజు, రమేష్, అర్జున్, నాగరాజు, సిద్దు తదితరులు హాజరయ్యారు.

## స్వాధీనం చేసుకున్న అక్రమ ఇసుక ...నేడు బహిరంగ వేలం

**రామాయంపేట తహసీల్దార్ రజనికుమారి...**

**రామాయంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** రామాయంపేట మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకపై చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ రజనికుమారి తెలిపారు. సహాయక డైరెక్టర్, మైన్స్ జియాలజీ, మెదక్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో మార్చి 30న తహసీల్దార్, మండల గిర్దావర్ కలిసి రామాయంపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, 18 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆ ఇసుకను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ కార్యాలయం ఆధీనంలో భద్రపరిచినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఏప్రిల్ 8న బుధవారం నాడు ఉదయం 11:30 గంటలకు రామాయంపేట తహసీల్దార్ కార్యాలయం పరిధిలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు నిర్ణీత సమయానికి హాజరై తమ బిడ్లు సమర్పించాలని తహసీల్దార్ రజనికుమారి సూచించారు.



## సాగు నీటి విడుదలకు విజ్ఞప్తి

**పాపన్నపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా రైతులకు సాగునీరు అందించి కర్షకులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి రైతులతో కలిసి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్సీ) కమిషనర్‌ను ఆశ్రయించారు.

మంగళవారం వారు నాంపల్లి లోని ప్రధాన కార్యాలయానికి చేరుకొని సింగూర్ ప్రాజెక్ట్ నుండి సాగు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ కమిషనర్ కు వినతిపత్రంసమర్పించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పదేళ్ల పాటు రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని, సింగూర్ జలాలను మెదక్ జిల్లాకు అంకితం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మాజీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష ్యంగా తీసుకున్న చర్యల వల్ల మెదక్ జిల్లాలో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, సింగూర్ నీటి వినియోగంతో వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయని వివరించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే 0.03 టీఎంసీ నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గణపూర్ ఆయకట్టు పరిధిలో పంటలు వేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశలో ఉండగా, నీటి కొరతకారణంగాఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆలస్యంగా క్రాప్ హాలిడే ప్రకటించడంతో రైతులు నష్టపోయారని విమర్శించారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో కనీసం ఒక తడి నీరు అందిస్తే పంట నిలబడే అవకాశంఉందనిపేర్కొన్నారు. రైతులనష్టాన్నినివారించేందుకు సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘణపురం ఆనకట్టకు అత్యవసరంగా 0.3 టీఎంసీ నీటిని విడుదల చేయాలని హెచ్ఆర్సీ కమిషనర్‌ను కోరారు. ఈ నీటి విడుదలతో ఎంఎన్, ఎఫ్ఎన్ కాలువల కింద ఉన్న పాపన్నపేట, కొల్చారం, హవేళి ఘణాపూర్, మెదక్ మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. రైతుల అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల్లోపు నీటి విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. వీరి వెంట జడ్పీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, కొడుపాక సర్పంచ్ కాశినాథ్ రావు, ఎంకేపల్లి మాజీ సర్పంచ్ బద్రి మల్లేశం తదితరులు, అలాగే కొడుపాక, ఎంకేపల్లి, నాగ్సాన్‌పల్లి, గాజులగూడెం, చిత్రియల్ గ్రామాల రైతులు ఉన్నారు.

**...హెచ్ఆర్సీ సానుకూల స్పందన...**

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి, రైతుల వినతిపై హెచ్ఆర్సీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలనుతెలుసుకున్నారు. సింగూర్ నుంచి రైతులకు నీరు విడుదలయ్యేలా సంబంధిత అధికారులతో చర్చించి తగిన సిఫారసులు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ విషయంపై స్పష్టమైన సమాచారం అందిస్తానని కమిషనర్ తెలిపారు.




## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీలో అవగాహన ర్యాలీ

**గుమ్మడిదల ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమాజంలో ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే గుట్కా, మద్యం, సిగరెట్లు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుందని అన్నారు. దేశ జనాభాలో సుమారు 65 శాతం యువత ఉండగా వారు సరైన మార్గంలో పయనిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అందువల్ల యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్, వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని తెలిపారు. అలాగే రోడ్డు పక్కన లభించే అనారోగ్యకరమైన తినుబండారాలను తీసుకోవద్దని సూచించారు. ప్రతి వ్యక్తి ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడంతో పాటు యోగా, మెడిటేషన్ చేయాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కూడా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ ్కాంత్ రెడ్డి, ఎంఈఓ పొలీన, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు మురళి, కిషన్, కత్తుల రమేష్ పాల్గొన్నారు. అలాగే నాయకులు హుస్సేన్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

**రోగులకు సరైన వైద్యం అందాలి...**
**భూ భారతి, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు...**
**జిల్లా అదనపు కలెక్టర్ ఎం. నగేష్...**



రామాయంపేటలో ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

**రామాయంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రామాయంపేట, నిజాంపేట మండలాలో మంగళవారం నాడు విస్తృతంగా పర్యటించారు. రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలన్నారు. స్టాక్ వివరాలను అడిగితెలుసుకున్నారు. నిజాంపేట్ పిహెచ్సి నీ పరిశీలించి రోగులకు మంచి వైద్యం అందాలన్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు అందించాలని వైద్యులకు సూచనలు అందించారు. నిజాంపేట తహసిల్దార్ కార్యాలయన్నీ తనిఖీ చేశారు భూ భారతి దరఖాస్తులను, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు అన్నారు. భూ సర్వే ,ఇసుక సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట పిహెచ్‌సీలో బీపీ చెక్ చేయించుకుంటున్న అదనపు కలెక్టర్

## సామాన్యుడి ధైర్యం.. సమాచార హక్కు చట్టం...

**పటాన్‌చెరు:ఏప్రిల్ 7,ప్రభాత వార్త :** సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) సామాన్యుడికి కొండంత ధైర్యమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ మాజీద్ అలీ అన్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతి లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర్య స్రవంతి చేతుల మీదుగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నియామక పత్రాన్ని అందించారు. అనంతరం మాజీద్ అలీ మాట్లాడుతూ.. పారదర్శకమైన పాలనకు ఆర్టిఐ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ పాలనలో ఎలాంటి రహస్యాలు ఉండకూడదని తెలిపారు. సమాచార హక్కు చట్టం మాత్రమే కాదు పాలనలో పౌరులు భాగస్వామ్యం కావడం అని అభిప్రాయపడ్డారు. ఈ చట్టాన్ని వ్యక్తిగత అవసరాలకు కాకుండా.. సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని అన్నారు. 2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని, దీనితో పాలనలో పారదర్శకత పెరిగిందని చెప్పారు. జవాబుదారీతనం పారదర్శకంగా పనిచేసేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరే సమాచారాన్ని అందించడంలో పీఐవో, ఏపీఐవో ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారం అందించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం 2005 లోని అంశాలు, ఆర్టిఐ దరఖాస్తు విధానం, దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తు ఫీజు, ఇవ్వాల్సిన సమాచారం, పీఐవో, ఏపీఐవో ల బాధ్యతలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర్య స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగటి రాజ్ కుమార్, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో పిహెచ్.డి. ప్రవేశాలు

**పటాన్ చెరు:ఏప్రిల్ 07,ప్రభాత వార్త :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నంలో నెలకొని ఉన్న మూడు ప్రాంగణాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను పీహెచ్.డీ. ప్రోగ్రామ్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ మంగళవారం వెల్లడించారు. ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్ మెంట్, ఫార్మసీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, న్యాయశాస్త్రం (లా) వంటి విభిన్న విభాగాలలో ఫుల్‌టైమ్ అభ్యర్థులకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తల కోసం రూపొందించిన ఎక్స్ ట్రామ్యూరల్ పీహెచ్.డీ. ప్రోగ్రామ్ – ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మసీ విభాగాలలో అందుబాటులో ఉందని ఆయన తెలియజేశారు. సంబంధిత మాస్టర్స్ డిగ్రీ (కనీసం 55 శాతం మార్కులు), కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, లేదా ఎం.ఫిల్. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులని ప్రొఫెసర్ రామగోపాల్ పేర్కొన్నారు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న చివరి ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గీతం రీసెర్చ్ అడ్మిషన్స్ టెస్ట్ (బిళ్లితిగి), దాని తరువాత జరిగే ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. గేబిదివినిగి, దిళీశివినిగి, బితిగిని, బిశితిగి, ।దితిళి, ్ను దీతీగిరిళినీ వంటి చెల్లుబాటయ్యే జాతీయ స్థాయి పరీక్ష స్కోర్లు ఉన్న అభ్యర్థులకు రాత పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుందని, వారిని నేరుగా ఇంటర్వ్యూకు పిలుస్తామని ఆయన వివరించారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మే 11, 2026 అని ప్రొఫెసర్ రామగోపాల్ స్పష్టీకరించారు. ప్రవేశ పరీక్షలు మే 23న (ఆన్ లైన్ లో), మే 30న (ప్రత్యక్షంగా) జరుగుతాయని, ప్రోగ్రామ్ ఆగస్టు 24, 2026న ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఫుల్‌టైమ్ పీహెచ్.డీ పరిశోధకులకు మూడు సంవత్సరాల వరకు నెలకు రూ.33 వేల ఫెలోషిప్ తో పాటు, అధునాతన పరిశోధనా సౌకర్యాలు, సహకారాలు, అకడమిక్ మద్దతును గీతం అందిస్తుందన్నారు.

# ప్రత్యేక అగ్నిమాపక భద్రతా తనిఖీలు

పటాన్ చెరు:ఏప్రిల్ 7,ప్రభాత వార్త :తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని పరిశ్రమలు, నివాస, విద్యా, వాణిజ్య మరియు ఇతర సంస్థలలో అగ్నిమాపక భద్రత ప్రమాణాల అమలు పై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రతి వారం ముందస్తు సమాచారం ఇచ్చి సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, నేషనల్ బిల్డింగ్ కోడ్ (వితీది) ప్రకారం అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, నిర్వహణ, సక్రమ పనితీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం పటాన్‌చెరు స్టేషన్ అగ్నిమాపక అధికారితో కలిసి పటాన్ చెరు, ఐడీఏ పశామైలారం లోని ఎం/ఎస్ న్యూల్యాండ్ లాబొరేటరీస్ లిమిటెడ్, యూనిట్।।, ఎం/ఎస్ క్రామ్సన్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా సంబంధిత సంస్థల సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంబంధిత సంస్థలు నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినట్లు గమనించామని, అయితే కొన్ని పరికరాలు పనిచేయకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వంటి లోపాలు గుర్తించి, అట్టి లోపాలను వెంటనే సరిదిద్దాలని, అన్ని పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించామని తెలిపారు. అదేవిధంగా, అగ్నిమాపక భద్రత ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన తర్వాత అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (విఠీది) కోసం ఫైర్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు అగ్నిమాపక భద్రత పట్ల అవగాహన పెంచడం, ప్రాణాలు, ఆస్తులు, మౌలిక సదుపాయాలను రక్షి ంచడం ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలో అగ్నిమాపక భద్రత నియమాలు కచ్చితంగా అమలవుతున్నాయో లేదో నిర్ధారించేందుకు ఈ తనిఖీలు నిరంతరం

## గుమ్మడిదల సర్వే నం.109 రైతులకు 100 గజాల స్థలం ఇవ్వాలి

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

గుమ్మడిదల, ఏప్రిల్ 7,ప్రభాతవార్త : రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నదని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. రైతు ప్రభుత్వం అంటూ చెప్పుకుంటున్నా గుమ్మడిదల, అన్నారం ప్రాంతాల రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109 పరిధిలోని 140 మంది రైతులకు చెందిన సుమారు 160 ఎకరాల భూమిని గత సంవత్సరం పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వం గిబి।దికు కేటాయించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రతి ఒక్కరికి 100 గజాల ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలుకాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, భూములు సేకరించే సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ ప్రకారం భూములు కోల్పోయిన 140 మంది రైతులకు 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల కోసం ఇప్పటికే 5 ఎకరాల భూమిని ప్రత్యేకంగా కేటాయించినట్లు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదేవిధంగా అన్నారం పరిధిలోని సర్వే నెంబర్ 261లో 117 మంది పేద రైతులకు చెందిన 117 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి ప్రజా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, షేక్ హుస్సేన్ రైతులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్

**నారాయణఖేడ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయాన్ని మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగ యువత తమ సమస్యలను చైర్మన్‌కి వివరించారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న చైర్మన్ నాగేష్ శెట్కార్ సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ సురేఖ, 6వ వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్, 13వ వార్డు కౌన్సిలర్ వివేకానంద మహేందర్, మైపాల్ రెడ్డి, పాండు, సురేష్ శేట్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్.

ఖేడ్ మున్సిపల్‌లో పలు వార్డుల్లో పర్యటించిన చైర్మన్ నాగేష్ శెట్కార్

## పచ్చదనమే భవిష్యత్‌కు బలమైన ఆధారం

**గుమ్మడిదల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి ప్రాంతంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కల నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం ద్వారా ప్రకృతి సమతౌల్యం కాపాడబడుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఎంపీడీఓ ఉమాదేవి, వార్డు కౌన్సిలర్లు చక్రపాణి, రమేష్, కుమార్ గౌడ్, నాయకులు శేఖర్ రెడ్డి, మహేష్, ఆంజనేయులు, పరిశ్రమ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభను వెతికి తీయడంలో సైన్స్ ఫేయిర్ ఉపయోగ పడుతుంది

**కొలన్ బాల్ రెడ్డి**

**జిన్నారం: ఏప్రిల్ 7,ప్రభాతవార్త :** విద్యార్థుల ప్రతిభను వెతికి తీయడంలో సైన్స్ ఫెయిర్ ఉపయోగ పడుతుందని జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అన్నారు. మంగళవారం బొల్లారం డివిజన్ వైస్సార్ కాలనీలోని వశిష్ట పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని బాల్ రెడ్డి విద్యార్థులకు చెప్పారు. వశిష్ట పాఠశాల విద్యార్థులు అనేక విభాగాల్లో తయారు చేసిన వివిధ రకాల నమూనాలను పాఠశాల కరెస్పాండంట్ లోకనాథంతో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఇలాంటి వైజ్ఞానిక విషయాలు తెలుసుకుని వాటిని గురించి వివరించడం అభినందించదగ్గ విషయం అని అన్నారు.

## కమ్మదారి రమేష్‌కు దళితరత్న అవార్డు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త): జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన కమ్మదారి రమేష్ మాల మహానాడు గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షునిగా ఉండి మాలల అభివృద్ధికి, జాతి కోసం చేసిన సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో దళితరత్న అవార్డును అందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అవార్డు రావడానికి సహకరించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జంజిరపు ఎల్లేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు రావడంతో తనపై బాధ్యత పెరిగిందని, దళితుల అభివృద్ధికి, మాలలు ఆర్థికంగా ఎదగడానికి, వారి సమస్యల ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

## కొల్చారంలో విషాద ఛాయలు

**బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్ మృతి**

**కొల్చారం, ఏప్రిల్7 ప్రభాతవార్త :** కొల్చారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యం ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వార్తతో కొల్చారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం కలిగిన ముత్యం ప్రవీణ్ కుమార్ ఇక లేరన్న వార్తను స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ముత్యం ప్రవీణ్ కుమార్ పార్థివ దేహాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజలు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ముత్యం ప్రవీణ్ కుమార్ అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం కొల్చారం గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ముత్యం ప్రవీణ్ కుమార్ ఫైల్ ఫోటో

## రాజకీయ ప్రయోజనాలకు సహకరిస్తున్న మెప్మా ఆర్పీలు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** పట్టణంలో కొందరు మెప్మా ఆర్పీలు ప్రభుత్వ కార్యక్రమాలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం రోజున ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో సంబంధం లేని వ్యక్తులను తీసుకువచ్చి ప్రభుత్వం అందించే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఇష్టారాజ్యంగా నిర్వహించారని, మరి కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులను తీసుకువచ్చి వారి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేయించారన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కొందరు మెప్మా ఆర్పీలు తమకు ఉన్న పరిచయాలను ఉపయోగించి వార్డు పరిధిలోని ఓటర్ల వివరాలను డబ్బులు తీసుకుని అధికార పార్టీ అభ్యర్థులకు ఇచ్చినట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయని, అదేవిధంగా అధికార పార్టీ కౌన్సిలర్లు గెలవడానికి ఓటర్లపై ఒత్తిడి తెచ్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని, మహిళా సంఘాలకు సంబంధించిన లోన్ల మంజూరు విషయంలో కమిషన్ ఇవ్వకపోతే ఫైళ్లు ముందుకు కదలడం లేదని, చిరు వ్యాపారస్తులు, మైనార్టీల వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే లోన్ల విషయంలో కూడా ముడుపులు అడుగుతున్నట్లు విపరీతంగా వినిపిస్తుందని, అలాగే కొంతమంది ఆర్పీలు ప్రభుత్వంచే జీతం, కమిషన్ తీసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొంతమంది వ్యక్తులు ఒకవైపు రేషన్ డీలర్లుగా పనిచేస్తూనే మరోవైపు ఆర్పీలుగా కొనసాగుతున్నారని, దీనికి కొందరు రాజకీయ నాయకుల ప్రోత్సాహం ఉందన్నారు. కొంతమంది కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు ఆర్పీలపై పెత్తనం చేయకుండా అధికారులు చూడాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ లను ఆయన కోరారు. లేదంటే ఆధారాలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## రేషన్ షాపు తనిఖీ చేసిన తహశీల్దార్

**సరఫరాలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం....**

**నార్సింగి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** నార్సింగి మండలంలోని అన్ని రేషన్ దుకాణాలలో మూడు నెలల బియ్యం టోకెన్ పద్ధతి ద్వారా సజావుగా సాగుతుందని తహశీల్దార్ గ్రేస్ బాయి తెలిపారు. మంగళవారం తహశీల్దార్ గ్రేస్ బాయి, కార్యాలయ సిబ్బంది తో పాటు మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ పలు అంశాల పై తనిఖీ నిర్వహించారు. మండలంలో నార్సింగి, వల్లూరు, జప్తి శివునూరు, శంకాపూర్ గ్రామాలలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసి స్టాకు రిజిస్టర్, బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం తరపున రేషన్ కార్డు దారులకు ఈ నెలలో మూడు నెలల కు సంబంధించి బియ్యం సరఫరా చేస్తున్నారని, మండల లోని అన్ని రేషన్ దుకాణాలలో మూడు నెలలకు సరిపడా బియ్యం సరఫరా జరిగిందని తెలిపారు. రేషన్ డీలర్లు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరతగతిన, టోకెన్ పద్ధతిలో మాత్రమే బియ్యం సరఫరా చేయాలని నిర్దేశించారు. సరఫరాలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

## ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి చెక్కులు

**నార్సింగి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** నార్సింగి మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మి ్మ, షాదీముబారక్ చెక్కులను సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు. నార్సింగికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ. 25,02,900 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఈ డబ్బులను వృథా చేయకుండా అవసరానికి వినియోగించుకోవలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయాన్ని పేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రేస్ బాయ్, రెవెన్యూ సిబ్బంది, వార్డు సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు తప్పని తిప్పలు..

**నార్సింగి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** నార్సింగి మండలం శంకపూర్ గ్రామంలో ఉపాధి పనుల కోసం మంగళవారం ఉదయం 7 గంటలకే 98 మంది కూలీలు పని ప్రదేశానికి వెళ్లారు. ఉదయం 10 గంటలు అయినా కూలీల ఐరిస్ క్యాప్చర్ కాలేదు. ఈ కేవైసీ రావడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పడంతో వారంతా ఇంటి బాట పట్టారు. గత రెండు రోజులుగా ఇలాగే జరుగుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలను విడిచిపెట్టి ఉదయాన్నే పనికి వచ్చామని, ఈ విషయం ముందే చెప్తే వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లమని అంటున్నారు. పాత పద్ధతిలోనే హాజరు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

## ఆర్టిజన్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):** ఆర్టిజన్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని ఆర్టిజన్ కార్మికుల జేఏసి సీనియర్ నాయకులు మరాఠి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆర్టిజన్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో వరంగల్‌లోని ఎన్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జగదేవ్‌పూర్ నుండి జేఏసి నాయకులు, కార్మికులు భారీగా తరలివెళ్లారు.

ఈ సందర్భంగా మరాఠి కృష్ణమూర్తి మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన మహాధర్నాకు గజ్వేల్ డివిజన్ నుంచి మర్కుక్, జగదేవ్‌పూర్ సెక్షన్ల నుంచి పెద్దఎత్తున ఆర్టిజన్ కార్మికులు, మీటర్ రీడర్లు తరలివెళ్లినట్లు తెలిపారు. ఆర్టిజన్ మీటర్ రీడర్లకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను మోసం చేసిందని, గతంలో కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఇప్పటికి కార్మికులను రెగ్యులరైజ్ చేయలేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్‌ను ఆర్టిజన్లుగా గుర్తించాలని, వారికి నెల రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు పొట్టోల్ల దాసు, ఖరార్‌బాయ్, రవి, కృష్ణ, మంగోలు శ్రీను, మురళి, మధు, పవన్, నాగరాజు, మీటర్ రీడర్స్ నరేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## గద్దరే తెలంగాణ జాతిపిత


పునరుజ్జీవ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

**రామచంద్రాపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ప్రజా గాయకుడు గద్దర్‌ను తెలంగాణ జాతి పితగా ప్రకటించాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్ డిమాండ్ చేశారు. 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై కాల్పుల ఘటనను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో గద్దర్ గళం వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌ల ఆధ్వర్యంలో గద్దర్ పునరుజ్జీవ సభను, అంతకు ముందు గద్దర్ గళం ఆధ్వర్యంలో మేధావులు, సామాజిక వేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కంచె ఐలయ్య మాట్లాడుతూ ఎలాంటి ఆస్తులు, పదవులు సంపాదించు కోకుండా జాతిపిత మహాత్మాగాంధీలా గద్దర్ నిస్వార్థ ఉద్యమం చేశారని గుర్తు చేశారు. గాంధీ మాదిరిగానే గద్దర్‌పై కాల్పులు జరిగాయన్నారు. ఒక తూటాకు గురైన గాంధీని జాతిపిత చేశారు, 6 బుల్లెట్లు దిగిన గద్దర్‌ను ఎందుకు జాతిపిత చేయలేదని ప్రశ్నిం చారు. తెలంగాణ జాతిపితగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించుకోవడంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఫిబ్రవరి 17న కెసిఆర్‌ను జాతిపితగా పేర్కొంటూ కటౌట్లు, బ్యానర్లు వేయించుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆగస్టు 6న గద్దర్ వర్ధంతి లోపు పెద్ద బహిరంగ సభను ఏర్పాటు చేసి గద్దర్‌ను జాతిపితగా ప్రకటించాలని, ప్రభుత్వం స్పందించకుంటే తెలంగాణ ప్రజానీకం ప్రభుత్వాన్ని క్షమించదన్నారు. ఒక్క కాళేశ్వరంలోనే లక్ష కోట్ల అవినీతి జరిగిందని విచారణ జరుగుతున్న తరుణంలోనే కెసిఆర్ తనను జాతిపితగా ప్రకటించుకోవడం ఏందని నిలదీశారు. కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, విమలక్క, పాశం యాదగిరి, బేబీరాజు, పృథ్వీరాజ్, డాక్టర్ శ్రీనివాస్, గుడిపల్లి రవి, పసునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

-విలేఖరులతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**మనూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని, రైతులకు చేసిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రమైన మనూర్‌లో స్థానిక విలేఖరులతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైతులకు 2 లక్షల రూపాయల పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ చేసి అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయడం లేదన్నారు. 15వేల రూపాయలను రైతు భరోసాగా అందిస్తామని చెప్పి రెండు పర్యాయాలు రైతులకు రైతు భరోసా డబ్బులు అందచేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో జొన్న, కందులు, మొక్కజొన్న, వరి పంటలు రైతుల చేతికి అందవస్తున్నా కొనుగోలు కేంద్రాలు చేయకపోవడంతో అకాల వర్షాలకు రైతులకు ఆర్థికంగా నష్టాలకు గురయ్యారన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, మాజీ జడ్పీటిసి సభ్యులు నాగేందర్, మాజీ సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే

**మనూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మంగళవారం మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికి చెందిన తెనుగు నర్సింలు కుమార్తె ప్రధాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, మాజీ జడ్పీటిసి సభ్యులు నాగేందర్, సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ ఎంపిటిసి సభ్యులు ఉమాకాంత్, గ్రామ బిఆర్‌ఎస్ కమిటి అధ్యక్షులు చంద్రకాంత్, నాయకులు శ్రీనివాస్‌రావుఉ, అమృత్ తదితరులు ఉన్నారు.

## మొగుడంపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


మొగుడంపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్‌సి బాధ్యులు

**మొగుడంపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మొగుడంపల్లిలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) నుంచి డాక్టర్ దివ్య జ్యోతి ఆధ్వర్యంలో గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతలపై డాక్టర్ అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరు గుర్తించాలని, తమ ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఈటి ఉత్సవ్2026 అంతర్జాతీయ సదస్సు

**నర్సాపూర్ ఎప్రెల్ 7, ప్రభాతవార్త :**

నర్సాపూర్ సమీపంలోని బి.వి.ఆర్.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సస్టైనబిలిటీ, ఆటోనమస్ వాహనాల కోసం యుటిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలపై ఈటి సదస్సు 2026 అంతర్జాతీయ సదస్సు (రెండవ రోజు కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో అకాడమిషియన్లు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ఉత్సాహంగా పాల్గొన గా విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రూపేష్ గణపత్రావ్ వాంధరే హాజరయ్యారు. సదస్సు లో ఆయన మాట్లాడుతూ "ఎలక్ట్రిక్ వాహనాల్లో ఉపయోగించే పవర్ కన్వర్టర్లు" అనే అంశంపై ప్రసంగిస్తూ ఈవి పవర్ ఎలక్ట్రానిక్స్‌లో వచ్చిన పురోగతులను వివరించారు. అనంతరం మరో విశిష్ట అతిథిగా జపాన్ దేశానికి చెందిన కురుమే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్. షూఇచి టోరి, మాట్లాడుతూ "ఫోటోవోల్టాయిక్స్, లిథియం బ్యాటరీల్లో ఉపయోగించే విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థల లక్షణాలు, పునరుత్పాదక శక్తి సమీకరణ మరియు నిల్వ సాంకేతికతల" ప్రాధాన్యతను వివరించారు. అంతేగాక ఈ సదస్సులో మరో విశిష్ట అతిథి ఇండోనేషియా దేశంలోని యూనివర్సిటీస్ సమ్ రతులాంగి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సలాకి రేనాల్డో జోషువా, వారు మాట్లాడుతూ "స్మార్ట్ ఎన్విరాన్‌మెంట్స్‌లో ఎనర్జీ ఫోరకాస్టింగ్ కోసం కంప్యూటర్ విజన్ మరియు ప్రిడిక్టివ్ అనలిటిక్స్ కలిపిన హైబ్రిడ్ తి విధానాలు" అనే అంశంపై ప్రసంగించారుఅంతర్జాతీయ సదస్సు చైర్మన్ డా. కాటూరి రాయుడు మాట్లాడుతూ చీఫ్ ప్యాట్రన్ శ్రీ కె. వి. విష్ణు రాజు, ప్యాట్రన్స్ శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్, శ్రీ కె. ఆదిత్య విశ్వం ల తోడ్పాటు ప్రోత్సాహం వల్ల సదస్సు విజయవంతంగా నిర్వహించడానికి ఎంతో దోహద పడిందన్నారు ఈ సదస్సులో బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీ ్మ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, ఇండస్ట్రీ రిలేషన్ షిప్ ప్లేసెమెంట్ డీన్ డాక్టర్ జె. బంగారాజు మరియు శ్రీ ఎన్. రామచందర్., కన్వీనర్ డా. పి. చంద్రబాబు, కోకన్వీనర్లు డా. జి. నరేష్ కుమార్, ఎ. మురళి, కాన్ఫరెన్స్ కోచైర్ డా. సి.సుబ్బరామిరెడ్డి ముఖ్య పాత్రపోషించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి ఎల్ ఎం సురేష్ పర్యవేక్షణలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, ఇండస్ట్రీ , కార్పొరేట్ విభాగాల అన్ని విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య అవగాహన

**నర్సాపూర్ ఎప్రెల్ 7, ప్రభాతవార్త :** నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. కె. హుస్సేన్ గారి మార్గదర్శకత్వంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జాతీయ సేవాపథకం ,జంతుశాస్త్ర విభాగం నేతృత్వరంలో బి.ఎస్.సి లైఫ్ సైన్సెస్ విద్యార్థులునర్సాపూర్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు చేతులు శుభ్రంగా కడుగురోవాలని నీరు పరిశుభ్రత వంటి వాటి పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరుచుకోవడం వంటి అంశాలను సులభమైన పద్ధతుల్లో వివరించారు. వాలంటీర్లు చిన్నారులతో పాటలు, ఆటలు మరియు ప్రదర్శనల ద్వారా చేతులు సరిగా కడుక్కోవడం వంటి ఆరోగ్య పద్ధతులను చూపించి వారికి పెరుగుతున్న ఎండల ప్రభావం పడకుండా నీటిని ఎక్కువగా తాగాలని అర్థమయ్యే విధంగా తెలియజేశారు. చిన్నారులు కూడా ఆసక్తిగా పాల్గొని కార్యక్రమాన్ని ఆనందంగా స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో బి.ఎస్‌సి లైఫ్ సైన్సెస్ వాలంటీర్లు వాలంటీర్లు ఐశ్వర్య ,నందిని ,రాజకుమార్ ,కళ్యాణ్, పూజిత, కార్తిక్, ప్రభాకర్ పాల్గొని చిన్నారులకు అవగాహన కల్పించారు.

# శిథిలావస్థలో అగ్రికల్చర్ ఏడి పాత భవనం

-ప్రారంభానికి నోచుకోని కొత్త భవనం

-కొత్త భవనంలోకి రావాలని నామ రవికిరణ్ డిమాండ్


వ్యవసాయ శాఖ ఏడి నూతన భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్

**జహీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** పట్టణంలోని 27వ వార్డులో గల వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉన్నా లక్షలు వెచ్చించి నిర్మించిన నూతన భవనంలోకి కుంటి సాకులు చూపుతూ కొత్త భవనంలోకి మారకపోవడం పట్ల బిఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొత్తగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని నామ రవికిరణ్ పరిశీలించి మాట్లాడుతూ...నాలుగేళ్ల క్రితం నిర్మించిన కొత్త భవనం నిర్మాణం పనులు పూర్తయినా చిన్న పాటి పనుల సాకుతో కొత్త భవనాన్ని ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. రైతుల, అధికారుల సౌకర్యార్థం గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2022 జనవరి 30న నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు భవన నిర్మాణానికి 40 లక్షలు మంజూరు చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. భవన నిర్మాణం పనులు దాదాపుగా పూర్తవగా కొన్ని చిన్న చిన్న పనులు మిగిలిఉన్నాయన్నార. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడం, కొత్త భవన ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిత్యం ఇటు అన్నదాతలు, అటు అధికారులు పడరాని పాట్లు పడాల్సిన దయనీయ స్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న చిన్న చిన్న పనులు పూర్తి చేసి కొత్త భవనంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించాలని నామ రవికిరన్ డిమాండ్ చేశారు.

# ఆరోగ్య శిబిరం పర్యవేక్షణ.. సేవలపై అవగాహన...


ధర్మారం పిహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

**రామాయంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరామ్ రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తూ రిజిస్టర్లు, రికార్డులను సరిచూశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. శిబిరంలో పాల్గొన్న లబ్ధిదారులతో మాట్లాడి, ముఖ్యంగా అంటువ్యాధులు కాని వ్యాధులు (ఎన్‌సీడీ) మరియు మహిళల ఆరోగ్యానికి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి (ఎంఓ) డాక్టర్ వైశాలి, సిహెచ్‌ఓ కొండయ్య, వెంకటేశ్వర్‌రావుతో పాటు పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హస్తల్ పూర్‌లో ప్రైవేట్ పాఠశాలలు చదువుతున్న విద్యార్థులను గుర్తించిన ఉపాధ్యాయులు

**వెల్దుర్తి , ఎప్రెల్ 7, ప్రభాతవార్త :**

హస్తాల్పూర్ గ్రామంలో మంగళవారం నాడు ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 6 నుండి చదువుతున్న విద్యార్థులను వారిని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాల కంటే మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అందుకు వచ్చే విద్యా సంవత్సరంలో వెల్దుర్తి లోని ఉన్నత పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం. బ్రేక్ఫాస్ట్ డిజిల్ విద్యా బోధన మోలిక సదుపాయాలను అందిస్తుందని అందుకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. గ్రామంలో ప్రైవేట్ విద్యా అభ్యసిస్తున్న వారి ఇండ్లకు వెళ్లి నమోదు కార్యక్రమం అని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబయ్య. వెంకటస్వామి. తుపతూ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

## ఖుత్బోద్దిన్ దేశానికి చేసిన సేవలు మరిచిపోలేనివి

**కొండపాక, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** సిఆర్‌పిఎఫ్ రిటైర్డ్ డిఎస్‌పి ఖుత్బోద్దిన్ మృతి దేశానికి, రాష్ట్రానికి తీరనిలోటని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన సిఆర్‌పిఎఫ్ రిటైర్డ్ డిఎస్‌పి ఎం.డి ఖుత్బోద్దిన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని కుకునూరుపల్లిలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి పార్థివ దేహం వద్ద సిఆర్‌పిఎఫ్ అధికారులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశానికి అయన చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో అయన పోషించిన పాత్ర చాలా కీలమైందన్నారు. దేశానికి, రాష్ట్రానికి అయన చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. అయన వెంట నాయకులు సంపత్, అమర్, అహ్మద్, సిఆర్‌పిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

## హిందుత్వం మతం కాదు ధర్మం

విశ్వబ్రహ్మ శ్రీపూజ్య వీర ధర్మజ స్వామీ


హిందూ కుటుంబాల సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ధర్మజ

**కొండపాక, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** గడప లోపల కులం గడపదాటితే హిందువులం అనే నివాదంతో అందరం కలిసి ఉండాలని విశ్వబ్రహ్మ శ్రీ పూజ్య వీర దర్మజ స్వామిజీ పిలుపు నిచ్చారు. మంగళవారం కుకునూరుపల్లిలో ఏర్పాటు చేసిన హిందూ కుటుంబాల మహా సమ్మేళనం కార్యక్రమం విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడు ఉప్పల రాజు అధ్వర్యంలో నిర్వహించగా అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందుత్వం మతం కాదు ధర్మం అని అందరికి అవగహన కల్పించారు. హిందూ ధర్మాని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హిందువులు ఇతర మతాల ప్రలోభాలకు గురై ఇబ్బందులు పడవద్దని సూచించారు. హిందూ ధర్మంపై ఇతర మతాలు చస్తున్న కుట్రలను వివరించారు. కులాలను వదిలి కాదు ధర్మం గెలువాలనే అకాంక్షతో కలిసి కట్టుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట హెచ్‌ఎం అనురాధ పాల్గొని కుకునూరుపల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ అమె భగవత్ గీత పుస్తకాలను అందించారు. కార్యక్రమానికి ముందు అయన సరస్వతీ మాత చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. భారతమాత, డాక్టర్ బి.అర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షునికి ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**




తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అమరావది లక్ష్మీనారాయణను ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో జిల్లాకు చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తణుకు అంజనేయులు తదితరులు మంగళవారం ఘనంగా సత్కారించారు. అమరావది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు హరినాథ్, తడక లింగమూర్తి, హేమలత, శ్రీకాంత్, మాధవి, కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, అర్వపల్లి హరికిరణ్, పురుషోత్తం, రంగయ్య, బిక్షపతి, రాజేశం, రాజేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

## గ్రామాభివృద్ధియే లక్ష్యం

**కొమురవెల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సర్పంచ్ పంజాల జ్యోతి మల్లేశంగౌడ్ అన్నారు. మండల పరిధిలోని కిష్టంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ట్యాంకులో పడి బాలిక మృతి

**చిన్నకోడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** నీటి ట్యాంక్‌లో పడి బాలిక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కమ్మర్లపల్లి గ్రామంగో మంగళవారం చోటు చేసుకుంది. అరుణ్‌తేజ రెండున్నర సంవత్సరాల బాలిక ప్రమాదవశాత్తు నీటి ట్యాంకులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదవశాత్తు నీటి ట్యాంకులో పడిన అరుణ్‌తేజను కుటుంబ సభ్యులు చూసిన వెంటనే బయటకు తీసి సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. బాలిక అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్సవ కమిటీల ఎన్నిక

**బెజ్జంకి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** బెజ్జంకి మండల కేంద్రంలో ఈనెల 11న 14న జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలను నిర్వహణకు ఉత్సవ కమిటీలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఐలేని శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఇస్కిల్ల ఐలయ్య, కార్యదర్శిగా జనగాం శంకర్, కోశాధికారిగా తిప్పారపు శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బొల్లం శ్రీధర్ పెద్దన్న, వైస్ చైర్మన్‌గా తిప్పారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా పొట్లపల్లి లక్ష్మణ్, కార్యదర్శిగా బొర్ర సురేష్‌కుమార్, కోశాధికారిగా లింగాల బాబులను ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీల సమన్వయ కర్తలుగా లింగాల లక్ష్మణ్, వడ్లూరి పర్శరాములు, లింగాల శ్రీనివాస్, బోనగిరి రూపేష్, జేరిపోతుల మధు, దీటి బాలనర్సు, లింగాల సురేష్, బొమ్మిడి సాయికృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ నాయకులు మహనీయుల జయంతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక యువకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బలోపేతమైన బిజెపి పార్టీ

బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్...

**నర్సాపూర్ ,ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని ప్రస్తుతం రాష్ట్రంలో బిజెపి పార్టీ పటిష్టవంతమైందని బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు మంగళవారం నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామంలో బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ గారు బిజెపి జెండాను బూత్ కమిటీ సభ్యుల, బిజెపి నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో రెండు పార్లమెంట్ స్థానాల నుంచి మొదలైన ప్రస్థానం దినదినా అభివృద్ధి చెందుతూ శ్యామప్రకాష్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ, వాజ్పేయి, అద్వాని ల అంకురార్పణతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ గారి సారథ్యంలో భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందే దేశంగా మారాలని సంకల్పంతో బిజెపి పార్టీ ముందుకు సాగుతుంద ని అన్నారు.

## బిజెపి పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేష్

**నర్సాపూర్ ,ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు నీలి నాగేష్ అన్నారు. నర్సాపూర్ మండలం నత్నాయపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ( బిజెపి) ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా నత్నాయపల్లి బూత్ లో నీలి నగేష్ తో పాటు ఉప సర్పంచ్ ఎల్లంతో కలిసి బీజేపీ జెండా ఆవిష్కరణ చేశారు .

## బుస్సారెడ్డిపల్లిలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**మునిపల్లి,ఏప్రిల్ 7(ప్రభాతవార్త):** మండలంలోని బుస్సారెడ్డిపల్లిలో మంగళవారం నాడు రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణపు పనులను సర్పంచ్ రేణుకావెంకట్రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి దామోదర రానర్సింహ సహాకారంతో బుస్సారెడ్డి పల్లిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోవడమే ల్యోంగా తాము ప చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

**చిలిపిచెడ్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త :** కృషి విజ్ఞాన కేంద్రం తునికి ఆధ్వర్యంలో శిలాంపల్లి గ్రామంలో భూమి సుపోషక మరియు సంరక్షక రైతు సోదరులందరూ తమ తమ పొలాల నుండి పూజ స్థలానికి మట్టిని తీసుకొచ్చారు. పూజ స్థలం సేకరించి మట్టి కుప్పలాగా చేసి అలంకరణ చేయడం జరిగింది. పూజ సమ యంలో రైతుల కుటుంబాలు పాల్గొని భూమిని పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం రసాయనాల విని యోగాన్ని తగ్గించడం మరియు సేంద్రియ మరియు సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం పైన రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఆరోగ్యకరమైన భూమి ఆరోగ్యకరమైన పంట ఆరోగ్యమైనా సమాజం కోసం అందరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీ రాజశేఖర్ గౌడ్ , అనిత వ్యవసాయ విస్తీర్ణ అధికారి గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కిష్టారెడ్డి, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వైద్య అవగాహన కార్యక్రమం

**సదాశివపేట,ఏప్రిల్ 7, (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైద్య అవగాహన కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రీతి, డా. శ్రీకాంత్ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన మందులు, వీళిళీ ప్యాకెట్లు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు సదాశివపేట పట్టణంలో ర్యాలీనిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. పి. మురళీ కృష్ణ, శకుంతల, శ్రావంతి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఘన విజయవంత మైందని, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు మరియు వాలంటీర్ల సేవలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బంగ్లా భారతీ అభినందించారు.

## వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

హుస్నాబాద్‌లో వాహనదారులకు ట్రాఫిక్ అవగాహన

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

అలర్ట్ టుడే – అలైవ్ టుమారో, అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చుని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు విధించే ఫైన్లు ఎక్కువగా ఉన్నాయని, పొద్దున పనికి వెళ్లి జీవనం సాగించే పేదవాళ్లు మద్యం సేవించి వాహనం నడిపి ఫైన్ కట్టే పరిస్థితి రాకుండా జాగ్రత్తపడాలని విజ్ఞప్తి చేశారు. అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, ఇతరులకు వాహనం ఇవ్వడం, డివైడర్ క్రాస్ చేసి మధ్యలో తిరగడం వంటి తప్పులు చేయవద్దని సూచించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ ఉండాలని వాహనదారులకు సూచించారు. అనంతరం వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రిఫిక్ సిబ్బంది దూదియా నాయక్, సంపత్, శేఖర్, పాల్గొన్నారు.

## చెత్త విభజనపై అవగాహన కలిగి ఉండాలి

క్ష మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య


మురుగు కాలువలు శుభ్రం చేపిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్7, ప్రభాతవార్త:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ ఆధ్వర్యంలో 14వ వార్డులో చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ బ్యాన్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మీ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్–2026 ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా విభజించవచ్చని ప్రజలు ఇంట్లోనే చెత్తను తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త, హానికరమైన చెత్తగా వేరు చేసి పురపాలక సంఘ వాహనానికి అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసుకునే విధానాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం డ్రైనేజీల వెంట స్ప్రేయింగ్, బ్లీచింగ్ వంటి శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణాధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఆఫీసర్లు శేఖర్, శ్రీకాంత్, వార్డ్ ఆర్పి అరుణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన బి ఆర్ఎస్ నాయకులు

**పటాన్ చెరు: ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ని పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ స్థానికులతో కలిసి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ప్రాంతంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు ఆయన అన్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం హరీష్ రావు స్థానికులతో సానుకూలంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత చేరువగా ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థి అదృశ్యం

**మొగుడంపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇప్పపల్లి గ్రామానికి చెందిన గొల్ల పవన్ కుమార్ (17) అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైనాడు. అదృశ్యమైన పవన్‌కుమార్ తండ్రి మహిపాల్ చిరగ్‌పల్లి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పవన్‌కుమార్ చింతకుంటలోని ఎంజేపి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యను అందుకుంటున్నారు. మంగళవారం ఉదయం కనిపించకుండా పోయిన పవన్‌కుమార్ ఆచూకి కోసం గాలిస్తున్నారు.

## యువత అదృశ్యం

**మొగుడంపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హరిచందర్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ జ్యోతి (20) అదృశ్యమైన సంఘటనకు సంబంధించి చిరాగ్‌పల్లి పోలీసు ఠాణా ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాథోడ్ జ్యోతి మండల పరిధిలోని గోవింద్‌పూర్‌లోని హాట్సన్ కంపెనీలో లేబర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తోందన్నారు. ఈ నెల 3న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కంపెనీకి వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. రాథోడ్ జ్యోతి తండ్రి పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పిసిసి నాయకులు

# మైసిగండి మైసమ్మ ఆలయంలో పిసిసి అధ్యక్షుడి ప్రత్యేక పూజలు

**కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం**

**రంగారెడ్డి అర్బన్,ఏప్రిల్7,ప్రభాతవార్త:** జిల్లా లోని కడ్తాల్ మండలంలోని ప్రసిద్ధ మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తి వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు,ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన నాయకులకు అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్, వంశీచంద్ రెడ్డి అభిషేకం, అర్చన, హారతి వంటి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పుష్పాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షం నెలకొనాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,పిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహ ముదిరాజ్,నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. నాయకులరాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై వారికి ఘన స్వాగతం పలికారు.అనంతరం నాయకులు భక్తులతో కలసి కొంతసేపు గడిపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి జూపల్లికి ఘన స్వాగతం పలికారు. బ్యానర్లు,నినాదాలతో వాతావరణం కాంగ్రెస్మయం అయింది.ప్రాంతీయంగా ప్రాచుర్యం పొందిన మైసిగండి మైసమ్మ ఆలయానికి ప్రత్యేక రోజుల్లో వేలాది మంది భక్తులు తరలివస్తుండగా,ఈ సందర్భంగా నాయకుల దర్శనం ఆలయానికి వచ్చిన భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది.



పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలుకుతున్న అర్చకులు

## గ్యాసు ఏజెన్సీ మంజూరు చేయాలి



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 07(ప్రభాతవార్త):** జిల్లేడు చౌదరి గూడ మండలంలో నూతనంగ గ్యాస్ ఏజెన్సి మంజురు చేయాలని కోరుతు బిఆర్ఎస్ నాయకులు తహసిల్దారు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసుత్తం మండలంలో ప్రజలకు గ్యాసు కొరత తీవ్రంగా ఉన్నదన్నారు. గ్యాసు కొరత లేదు అని చెప్తున్నా, గ్యాసులు ఏజెన్సీలు బ్లాకులో అమ్ముతున్నారని పేర్కొన్నారు. మండలంలో దాదాపు 40వేల జనాభా ఉందని అన్నారు. జనాభాకు తగిన గ్యాస్ సరఫర కావడం లేదని మండలంలో నూతనంగ గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ హఫీజ్, కొండి యాదయ్య ,రాములు, మణయ్యా. రాజు,ఇస్మాయిల్, నర్సింహులు, జబ్బారు, జహంగీర్, మల్లేష్, శివరాజ్,అజ్మీర్ ,గోపాల్, చందర్ నాయక్, హిర్య నాయక్ ,మాన్య తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడ స్లాటర్ హౌజ్‌ను తెరువకపోతే సహించం

**-బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ధ్వజం**

**చేవెళ్ల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** జియాగూడ స్లాటర్ హౌజ్‌ను తెరువకపోతే సహించేదిలేదని, సిఎం రేవంత్‌రెడ్డి జాగీరా, ఇష్టాను సారంగా వ్యవహరిస్తే మాత్రం ఊరుకోమని బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ జియాగూడ్ స్టాటర్ హౌజ్ మార్కెట్‌కు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని రైతులు, ప్రజలు అధికసంఖ్యలో వస్తుంటా మని, మా ప్రాంత ప్రజల కడుపు కొడితే మాత్రం ఊరుకునేది లేదన్నారు. ప్రతి నిత్యం 200 కోట్ల వ్యాపారం చేసే మార్కెట్‌ను బంద్ చేస్తారా అన్నారు. రైతుల, ప్రజల మార్కెట్‌ను బంద్ చేస్తేమాత్రం నీ అంతు చూస్తామని హెచ్చరించారు.వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే పనులు మానుకుని ప్రజలకు ఉపయోగ పడే పనులపై దృష్టి సారించాలన్నారు.రోజు కూలీలు అధికంగా ఉన్నారని, కూలీలకు రోజూ పని కల్పించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.



జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను సందర్శించిన బిఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

జియాగూడ స్టాటర్ హౌజ్ మార్కెట్ నిజాం కాలం నుండి నడుస్తుందన్నారు. ప్రభుత్వం పనికిరాని పనులను చేస్తుంటే ఊరుకోమన్నారు. వారం రోజుల్లోపు స్టాటర్ హౌజ్ మార్కెట్‌ను తెరువకపోతే పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు.

## దౌల్తాబాద్‌లో బిఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులు!

**-హరీష్ రావు పర్యటన వేళ ఉద్రిక్తత -అర్ధరాత్రి నుంచే పోలీసుల నిర్బంధం**




బిఆర్ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

**దౌల్తాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై గళమెత్తితే అక్రమ అరెస్టులతో అణిచివేస్తారా? అంటూ బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం మండిపడ్డారు.పరిగి మండంలోని కాళ్లాపూర్,రాపోల్ గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులకు మద్దతుగా మాజీ మంత్రి హరీష్ రావు వస్తున్న నేపథ్యంలో మంగళవారంరోజు తెల్లవారుజామున 4:00 గంటల ప్రాంతంలో దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పలువురు బిఆర్ఎస్ ముఖ్య నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతు భరోసా రాక,పూర్తిగా రుణమాఫీ కాక,ఎరువులు అందక రైతులు అల్లాడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం,వారి తరపున పోరాడుతుంటే అక్రమ కేసులు పెడుతోందని మండిపడ్డారు.మాకు.ఉద్యమాలు,కేసులు,జైళ్లు కొత్తకాదని,పోలీసుల బలాన్ని చూపి ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం అప్రజాస్వామికమని,తాటాకు చప్పుళ్లకు బిఆర్ఎస్ నాయకులు భయపడరని అన్నారు.ప్రజా పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని,ఈ అక్రమఅరెస్టులను ప్రజలు గమనిస్తున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్,వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి,బిఆర్ఎస్ అధికార ప్రతినిధి సంతోష్, ఆశప్ప,బాలరాజ్.వెంకటరెడ్డి,మాజీ సర్పంచులు రమేష్,అశోక్,హరికృష్ణ పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**- ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవనం సాగుతుంది**
**-చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య వెల్లడి**

**చేవెళ్ల ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ఆరోగ్యంగా ఉంటేనే మనిషి జీవనం సాగుతుందని, ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పిన మాటలు పాటించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అందజేశారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకుని చేవెళ్ల అసుపత్రిని ఎమ్మెల్యే సందర్శించారు.చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను ఘనంగా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం ఉంటేనే సంపద కలుగుతుందన్నారు.మనిషి ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అవసరమన్నారు.జీవితంలో ఒత్తిడి అందోళనలు పెరుగుతున్నాయని, ప్రతి రోజు వ్యాయమం, నడకతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు.ప్రతి రోజూ మనిషి సరైన నిద్రపోవాలన్నారు.



చేవెళ్ల ఏమ్మేల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య

ప్రభుత్వం ఆరోగ్య పరిరక్షణ కొరకు అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వ అసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యంను అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి,మంగళి కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, క్రిష్ణానాయక్, తాళ్లపల్లి నర్సింలు, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్య గౌడ్,వైస్ చైర్మన్ బేగరి రాములు,గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి,చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస గౌడ్,మాజీ ఎంపిటిసి గుండాల రాములు,మాజీ సర్పంచులు జాంగీర్, శంకర్,పడాల ప్రభాకర్,ముడిమ్యాల సహకార సంఘం మాజీ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి,చేవెళ్ళ సహకార సంఘం మాజీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,నాయకులు రవీందర్,ఆగిరెడ్డి,మల్లేష్, పాల్గొన్నారు.



ప్రపంచ అరోగ్య దినోత్సవం సందర్భంగా చేవెళ్ల ప్రభుత్వ అసుత్రిని సందర్శించి అసుపత్రిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చేవెళ్ల ఎమ్మేల్యే కాలే యాదయ్య

# గంజాయి,బెల్ట్ షాపులను నివారించండి




పోలీస్ కమిషనర్‌ని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**కడ్తాల్, ఎప్రిల్ 7, ప్రభాత వార్త :** కడ్తాల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో యువత గంజాయి మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, అక్రమ గంజాయి రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పిఎస్ నాయకులు పోలీసులను కోరారు. కడ్తాల్ ఎమ్మార్పిఎస్ మండల్ అధ్యక్షుడు అబ్బు రమేష్ మహేశ్వరం మండల ఎమ్మార్పిఎస్ అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ఎసిపి జానకి రెడ్డిని కలిశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోకి అక్రమంగా గంజాయి సరఫరా జరుగుతోందని, దీనివల్ల యువత దారి తప్పుతున్నారని తెలిపారు. గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామాల్లో నడుస్తున్న బెల్టు షాపులపై కూడా కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా సాయంత్రం సమయాల్లో గ్రామాల్లో యువతకు గంజాయి ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోలీసులు మరియు స్థానిక నాయకులు కలిసి చైతన్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దాసప్ప గారి కిరణ్, విజేందర్, కె.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తాండూరు వరకు పొడిగించాలి..!

**-- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బిజెపి కౌన్సిలర్లు**

**తాండూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పల్నాడు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను వికారాబాద్ జంక్షన్‌లోనే ఆపకుండా తాండూరు వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాలంటూ తాండూరు పట్టణ బిజెపి కౌన్సిలర్లు నాగారం మల్లేశం, శ్రీకాంత్‌రెడ్డి, అంతారం కిరణ్ చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. మంగళవారం బిజెపి కౌన్సిలర్లు ఎంపి కొండాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపి వెంటనే సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు రిక్వెస్ట్ లెటర్‌ను పంపించారు. అదేవిధంగా మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం తాండూరుపట్టణంలో గెలుపొందిన ముగ్గురు బిజెపి కౌన్సిలర్లకు వార్డుల అభివృద్ధి కోసం ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున ఎంపి నిధులకు మంజూరు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన బిజెపి కౌన్సిలర్లు.

# సంక్షేమ పథకాల్లో డబ్బుల వసూళ్ళకు పాల్పడితే సహించేది లేదు

**నాయకులకు తిరుపతిరెడ్డి వార్నింగ్**

**కొడంగల్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి నాయకులు డబ్బుల వసూళ్ళకు పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి హెచ్చరించారు.మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉండి ఆసుపత్రి బిల్లులు భరించలేని వారి కోసం ప్రభుత్వం అందిస్తున్న సిఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎవరైనా డబ్బులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని సూచించారు.సిఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎలాంటి పైరవీలు అవసరం లేదని,ఏ అధికారికి గాని,కాంగ్రెస్ కార్యకర్తలకు కాని డబ్బులు ఇవ్వరాదని అన్నారు.ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకొనిరావాలని అన్నారు.పేదలకు ఆసుపత్రుల్లో చికిత్స కోసం మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని గుర్తు చేశారు.ఇలాంటి పథకాల్లో చేతివాటం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని తిరుపతిరెడ్డి వార్నింగ్ ఇచ్చారు.కొడంగల్ మండలంలో 47 మంది లబ్దిదారులకు సుమారు రూ.25లక్షల వరకు చెక్కులను ఆయన లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,కొడంగల్,కోస్గీ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,నాగులపల్లి నరేందర్‌రెడ్డి, వికారాబాద్,నారాయణపేట్ జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మేన్‌లు రాజేష్‌రెడ్డి,వార్ల విజయ్‌కుమార్,కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్,మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్,కొడంగల్,కోస్గీ మండలాల కాంగ్రెస్ నాయకులు కొడంగల్ నయ్యూం,అసీఫ్‌ఖాన్, రఘువర్ధన్‌రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్‌లు కుశగారి రాజశేఖర్,బత్తుల అనితనర్సింహులతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న తిరుపతిరెడ్డి

**ప్రభుత్వ అతిధి గృహం నిర్మాణ పనుల పరిశీలన :**

కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ అతిధి గృహం నిర్మాణ పనులను తిరుపతిరెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆర్అండ్‌బి అధికారులతో కలిసి అతిధి గృహనికి చేరుకొని నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# భూసేకరణపై బిఆర్ఎస్ గర్జన

నాయకుల అరెస్టును తప్పుబట్టిన కే. వేణుగోపాల్ రెడ్డి

**ధారూర్, ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో పేద రైతుల భూములను లాక్కోవడాన్ని ప్రశ్నించినందుకు బిఆర్ఎస్ అగ్ర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కే. వేణుగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పరిగి మండల పరిధిలోని కడ్లాపూర్, రాపోల్ గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల భూమిని ప్రభుత్వం బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ ఆయన తీవ్రంగా స్పందించారు. మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ ల అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత నెల రోజులుగా కడ్లాపూర్, రాపోల్ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులు తమ భూములు కాపాడుకోవడానికి నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. రైతులకు మద్దతుగా నిలిచిన నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపడం ద్వారా ప్రభుత్వం తన చాటుకుందని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. రైతుల పొట్ట కొట్టి ప్రభుత్వం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఎండగడతామని, ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఈ నిరసనల నేపథ్యంలో ధారూర్ పోలీసులు ముందస్తు జాగ్రత్తగా పలువురు నాయకులను అరెస్ట్ చేశారు.ఆయనతో పాటు మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, ధారూర్ వార్డ్ సభ్యులు సీతగారి లక్ష్మయ్య, హఫీజ్ ఖురేషి, జైపాల్ రెడ్డి, వెంకట్, బింషెన్, బాలు నాయక్, రవి నాయక్, హయమతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




ధారూర్ పోలీసుల అదుపులో బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**తండ్రి మరణించినా**

# గుండె నిబ్బరంతో పదో తరగతి పరీక్ష రాసిన శేషికల

**ధారూర్, ఏప్రిల్ 7,ప్రభాత వార్త:** విధి ఆ బాలికను కోలుకోలేని దెబ్బ తీసింది. కళ్ల ముందే కన్నతండ్రి విగతజీవిగా పడి ఉన్నా, ఆ కన్నీళ్లను దిగమింగుకుని తన భవిష్యత్తు కోసం ఆ యువతి పరీక్షా కేంద్రానికి కదిలివచ్చింది. ఈ విషాదకర సంఘటన ధారూర్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, మండల పరిధిలోని బోజ్యా నాయక్ తండాకు చెందిన రవి నాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన కుమార్తె శేషికల ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తోంది.బయోలాజీ పరీక్ష కావడంతో, తండ్రి మరణించిన తీవ్ర దుఃఖంలోనూ ఆమె ధైర్యాన్ని కోల్పోకుండా కెరెల్లిలోని పరీక్షా కేంద్రానికి చేరుకుంది. ఇంటి వద్ద తండ్రి భౌతిక కాయం ఉండగానే, తండ్రి కన్న కలలను నిజం చేయాలన్న సంకల్పంతో ఆమె పరీక్ష రాసింది.పరీక్షా కేంద్రంలో శేషికల పరిస్థితిని చూసిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కంటతడి పెట్టుకున్నారు. పితృవియోగం కలిగినా గుండె నిబ్బరంతో పరీక్ష రాసిన శేషికల ధైర్యాన్ని చూసి స్థానికులు ఆమెను అభినందిస్తూనే, ఆ కుటుంబాన్ని ఓదార్చారు. పరీక్ష ముగిసిన వెంటనే శేషికల తన ఇంటికి చేరుకుని తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.





అనురాగ్ యూనివర్శిటీ పేద వికలాంగ యువకుడికి ల్యాప్టాప్‌ను అందజేసిన డీన్ విష్ణుమూర్తి తదితరులు.

## అనురాగ్ యూనివర్శిటీ సహాయ ద్వారా వికలాంగ యువకుడికి ల్యాప్టాప్ పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్.ఏప్రిల్ 7, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ వారు సహాయ కమ్యూనిటీ సపోర్ట్ ఇనిషియేటివ్ ద్వారా వికలాంగ యువకుడికి మంగళవారం ల్యాప్టాప్ అందజేశారు. అనురాగ్ యూనివర్శిటీ తన సామాజిక బాధ్యత విభాగమైన సహాయ ద్వారా అవసరంలో ఉన్నవారికి నిరంతరం సహాయం అందిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. స్థిరమైన జీవనోపాధి సాధించేందుకు సహయంగా శీలా కొమరుమల్లుకు ల్యాప్టాప్‌ను అందజేసినట్లు కళాశాల డీన్ జి. విష్ణుమూర్తి తెలిపారు. సహాయ సమన్వయ కర్యకర్తలైన నాగరాజు, అమితా మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి తై బజార్ వేలం రూ.4.40వేలు

**దక్కించుకున్న పెరుమాండ్ల జంగయ్య**

**తలకొండపల్లి ,ఏప్రిల్ 7 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి గ్రామపంచాయతీలో మంగళవారంనాడు నిర్వహించిన తైబజార్ వేలంపాటలో 4,40,500 రూపాయలు పలికి అదే గ్రామానికి చెందిన పెర్మాండ్ల జంగయ్య అనే వ్యక్తి వేలంపాటల దక్కించుకున్నాడు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను మంగళవారంనాడు గ్రామపంచాయతీలో వేసిన వేలంపాటలో ఐదుమంది పాల్గొన్నారు. చివరకు 4,40,500 రూపాయలతో పెరుమాల జంగయ్య తై బజార్ను దక్కించుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో జంగయ్యను గ్రామపంచాయతీ సర్పంచ్ శేఖర్ యాదవ్ ఉపసర్పంచ్ కోటీశ్వర్ గ్రామ కార్యదర్శి సత్యం ఆధ్వర్యంలో జంగయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ తైబజార్ వేలం ధర వచ్చిన నిధులతో గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని, ప్రజలకు అవసరం మౌలిక వసతుల కోసం ఖర్చు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంట సంక్షేమ నిధుల జల్లు!

**-దౌల్తాబాద్‌లో ఘనంగా చెక్కుల పంపిణీ**



**దౌల్తాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు.మంగళవారంరోజు మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని,మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ది దారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..ఆడబిడ్డల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి,షాదిముబారక్ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.అలాగే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) ఒక వరమని అన్నారు.82 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులను,61 మంది బాధితులకు సీఎం సహాయ నిధి(సిఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని ఆయన ఈ సంధర్భంగా హామీ ఇచ్చారు.చెక్కులు అందుకున్న లబ్దిదారులు తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,తహసీల్దార్ గాయత్రి,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రావు,బోడి వెంకట్‌రెడ్డి,జంగం వీరన్న,సత్యపాల్,ప్రమోద్‌రావు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,పార్టీ కార్యకర్తలు,లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరెలతో మహిళలకు గౌరవం

**కొత్తూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ పరిధిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మహిళలకు శరీరం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని మరింత బలపరచాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.చీరలు అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, వైస్ చైర్మన్ దోలి రవి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జె సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు హేమా దేవేందర్ ముదిరాజ్, కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, కే సురేందర్, జై జగన్, చిల్కమారి నరసింహ, ఇందూరి శ్రీనివాస్, ఆంజనేయులు గౌడ్, జనార్ధన్ చారి, నరసింహ గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఇన్స్పెక్టర్ నర్సయ్య, మరియు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

